సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం । 12 । జూన్ । 2023



సన్మానం

వేములవాడ: సిరిసిల్లలో ఇటీవల జరిగిన ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్‌లో మొదటి స్థానంలో నిలిచిన వేములవాడ మహిళా మత్స్యపారిశ్రామిక సంఘం సభ్యులను సన్మానించారు.



కేంద్రాన్ని గద్దెదించాలి

ఇల్లంతకుంట(మానకొండూర్): కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రసాద్ పేర్కొన్నారు. పెద్దలింగాపూర్‌లో పార్టీ శిక్షణ తరగతులు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

39.0/29.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మోగిన బడి గంట

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యాసంస్థలు సోమవారం నుంచి పునర్ ప్రారంభంకానున్నాయి. వడగాలులు తీవ్రంగా వీస్తుండడంతో వేసవి సెలవులను పొడగించాలనే డిమాండ్ వస్తుంది. జిల్లాలో 510 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా ఇందులో దాదాపు 48 వేల మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించే ప్రభుత్వ విద్యాలయాలు 19 ఉండగా ఇందులో 8 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో 122 ప్రైవేటు పాఠశాలలుండగా సుమారు 22 వేల మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం.

వర్షాలు కురువాలని కందూర్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వర్షాలు సమృద్ధిగా కురువాలని, పాడిపశు సంపద సల్లంగా ఉండాలని కోరుతూ మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామస్తులు ఆదివారం సదర్ కందూర్ నిర్వహించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం గ్రామ శివారులోని సత్తెపీరీల దర్గా వద్ద కందూర్ చేశారు. సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు చేశారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు మొడుసు బుచ్చిరెడ్డి, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, వంగ బాపురెడ్డి, నారాయణరెడ్డి, రాజిరెడ్డి, అశోక్, సత్యం, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఫౌండేషన్



వేములవాడ: వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05 సంవత్సరం పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం తిరిగి కలుసుకున్నారు. ఓ ఫౌండేషన్‌గా ఏర్పడి సామాజిక సేవ చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు 13 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బడుగు అరుణ్, ఉపాధ్యక్షులుగా లకావత్ దేవేందర్, మల్లమర్రి కరుణాకర్, దొబ్బల శ్రీనివాస్, వేముల ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ శ్రీకాంత్, కోశాధికారిగా సామ ప్రశాంత్, సలహాదారులుగా అక్కెనపల్లి కరుణాకర్‌ను నియమించుకున్నారు.

దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): దేవుడి చిన్నచూపుతో అవిటి వారిగా పుట్టామని.. మేము మనుషులమే.. మాకు ఆత్మాభిమానం ఉంటుంది.. మమ్మల్ని మనుషులుగా చూడండి అంటూ దివ్యాంగులు భావోద్వేగానికి గురయ్యారు. ముస్తాబాద్‌లోని ఏఎంఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఎంపీపీ జనగామ శరత్‌రావు ఆధ్వర్యంలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మండలంలోని 963 మంది దివ్యాంగులు హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ మానవతా దృక్పథంతో రూ.3వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4వేలకు పెంచారన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో కలిసి ఎంపీపీ శరత్‌రావు, నాయకులు భోజనాలు చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణాధ్యక్షులు సురేందర్‌రావు, నర్సింహారెడ్డి, సర్పంచులు సుమతి, కిషన్‌రావు, రవీందర్‌రెడ్డి, దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విజయరామారావు, జానబాయి, సర్వర్, షాదుల్, బాలయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో జిల్లా అధికారులు, ఉద్యోగులు నిమగ్నమైనందున ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

వేములవాడఅర్బన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమవుతాయని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వేములవాడలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, సుమిత్ర జూనియర్ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ముంపు ముప్పు తప్పేనా !

- సిరిసిల్లకు వర్షా'కాల' భయం..
- చినుకు పడితే వణుకే..
- పూర్తికాని వరద మళ్లింపు పనులు



ఇది సిరిసిల్లలోని సంజీవయ్యనగర్ వెళ్లే వీధి. మే 30న తెల్లవారుజామున కురిసిన వర్షంతో సంజీవయ్య విగ్రహం వద్ద చేరిన మురికి నీరు ఇది. ఓ గంట సేపు గట్టిగా వర్షం పడితే ఎండాకాలంలోనూ వరదనీరు రోడ్డుపైకి చేరుతుంది. ఆ వీధిలోకి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక వెంకంపేటరోడ్డు సైతం ఇలాగే జలమయమైంది.



ఇది సిరిసిల్ల నేతన్నచౌక్ ముందు సురభి హోటల్ వద్ద రోడ్డుపైకి చేరిన మురికిని మున్సిపల్ సిబ్బంది తొలగిస్తున్న తీరు. సిరిసిల్లలో గట్టిగా ఒక్క వాన పడితే చాలు డ్రెయినేజీలోని నీరంతా ఇలా రోడ్డుపైకి చేరుతుంది. నీరు వెళ్లిపోయాక ఇలా మురికి ఆరిపోయి రోడ్డుపై పేరుకుపోతుంది. ఆ మురికిని మున్సిపల్ సిబ్బంది ఎత్తిపోస్తారు. సిరిసిల్ల నడిబొడ్డున నేతన్నచౌక్‌లో వర్షం పడిన ప్రతీసారి ఎదురయ్యే మురికి సమస్య ఇదీ..



శ్రీనగర్‌కాలనీలో కచ్చా డ్రెయినేజీ తవ్వకం

సిరిసిల్ల: వర్షాకాలం వచ్చిందంటే చాలు సిరిసిల్ల పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షానికి సిరిసిల్లను వరద ముంచెత్తుతోంది. ఏటా ఈ సమస్య ఎదురవుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. మూడేళ్లుగా వరద ముంచెత్తుతూనే ఉంది. డ్రెయినేజీలను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం.. మురికికాల్వల్లోని పూడికను తొలగించపోవడం.. చెరువులను కబ్జా చేయడంతోనే ఈ సమస్య ఎదురవుతుంది. డ్రెయినేజీల విస్తరణ పనులు మున్సిపల్ అధికారులు చేపట్టినప్పటికీ పూర్తికాలేదు. వర్షాకాలం సమీపిస్తుండడంతో మళ్లీ ముంపు ముప్పు తప్పేలా లేదని భయాందోళన చెందుతున్నారు.

చెరువులు మాయం.. కాలనీలు ప్రత్యక్షం

రాయిని చెరువును పూర్తిగా పూడ్చివేసి బీవై నగర్, గణేశ్‌నగర్, సుందరయ్యనగర్, తారకరామానగర్, ఇందిరానగర్ కాలనీలుగా అవతరించాయి. కొత్తచెరువును సుందరీకరణ పేరుతో శిఖం ప్రాంతాన్ని పూడ్చివేసి ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. దీంతో కొత్త చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. మురికినీటి శుద్ధి పేరుతో ప్రధాన డ్రెయినేజీపై పద్మనగర్ ఈటీపీ ప్లాంటును లోపభూయిష్టంగా నిర్మించడంతో కాల్వలోని మురికి నీరంతా ఇళ్లలోకి చేరుతుంది. ఫలితంగా వర్షం నీరు అశోక్‌నగర్, సంజీవయ్యనగర్‌ను ముంచెత్తుతోంది. సిరిసిల్ల పట్టణ నడిబొడ్డులోని ఉదారు వాగు కబ్జాకు గురైంది. ఇలా పాలకుల నిర్లక్ష్యంతో పట్టణం వరద సమస్యను ఎదుర్కొంటుంది. మరోవైపు మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ ఇంజినీరింగ్ శాఖల మధ్య సమన్వయలోపంతో ఎవరికి వారు పనులు చేసుకుంటూ వెళ్లడంతో వరద సమస్య జఠిలమవుతోంది.

వేగంగా పనులు చేస్తేనే...

- కొత్త చెరువు మత్తడి దూకితే వచ్చే వరదనీరు శ్రీనగర్ కాలనీని ముంచెత్తకుండా కచ్చా కాలువను బైపాస్ రోడ్డు వరకు కొనసాగించాలి. అప్పుడు వరద తుమ్మలకుంటలోకి వెళ్తోంది.
- రాజీవ్‌నగర్, ముష్టిపల్లి నుంచి వచ్చే వరద నీటిని కొత్త చెరువులోకి నేరుగా చేరేలా రూ.6.21 కోట్లతో చేపట్టిన పనులు పూర్తి చేయాలి.
- వెంకంపేటలో చేపట్టిన సిమెంట్ రోడ్డు, మురికి కాల్వ పనులు పూర్తి చేస్తేనే ఈ ప్రాంతానికి వరదనీటి ఇబ్బందులు తప్పుతాయి. మురికికాల్వ పనులు వేగంగా పూర్తి చేస్తే పాత బస్టాండును ముంచెత్తే వరదనీటి ఇబ్బందులు తప్పుతాయి.
- సాయినగర్ నుంచి శాంతినగర్ వరకు ఉన్న ప్రధాన మురికికాల్వలో పేరుకున్న పూడికను తొలగించాలి. ఓపెన్ డ్రెయిన్‌లో పూడిక తీసేందుకు రూ.8 లక్షలతో టెండర్లు పిలిచినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. వర్షాలు పడితే.. మురికి నీరు రోడ్డెక్కే ప్రమాదం ఉంది. పూడిక తొలగించాలి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ పనులు పూర్తయితేనే వర్షాకాలంలో వరద ముప్పు తప్పుతుంది.



సిరిసిల్లలోని అంబికానగర్–పద్మనగర్ మధ్య ప్రధాన డ్రెయినేజీలోని మురికిని తొలగించి ఇలా కాల్వను విస్తరించే పనులు చేపట్టారు. ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు. వర్షాకాలం సమీపించినా ఈ పనులు పూర్తికాకపోవడంతో వానాకాలంలో వర్షాలు పడితే మళ్లీ వరద నీరు సిరిసిల్ల పట్టణాన్ని ముంచెత్తే ప్రమాదం ఉంది.



ఇది శ్రీనగర్‌కాలనీలోని కచ్చా కాల్వలో వేసిన పైపులైన్లు. వరద నీటిని బైపాస్‌రోడ్డు వైపు మళ్లించేందుకు కొత్తచెరువు నుంచి కచ్చా కాల్వను గతేడాది తాత్కాలికంగా తవ్వినా.. దాన్ని పూర్తి చేయలేదు. ఫలితంగా ఇప్పుడు శ్రీనగర్‌కాలనీలో కచ్చా కాల్వనే ఉంది. దీంతో వరద ముంచెత్తితే శ్రీనగర్‌కాలనీ మళ్లీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

వరద ముప్పు లేకుండా పనులు



సిరిసిల్ల పట్టణంలో వరద ముప్పు లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ పనులు చేపట్టాం. అన్ని చోట్ల పనులు చివరి దశకు చేరాయి. రాజీవ్‌నగర్ నుంచి వచ్చే వరద నీరు కొత్త చెరువులోకి వెళ్లే కాల్వ పని ఇంకా 70 మీటర్లు మాత్రమే ఉంది. దీన్ని పూర్తి చేస్తాం. శ్రీనగర్‌కాలనీలో కచ్చా కాల్వను పూర్తి చేస్తాం. వరద నివారణ పనులను పూర్తి చేసి వరద సమస్య పునరావతం కాకుండా చూస్తాం.

– వి.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

రాజన్న సేవలో కేంద్ర మాజీ మంత్రి



వేములవాడ: రాజన్నను కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో బి.శ్రీనివాస్, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. అద్దాల మండపంలో వేదోక్త ఆశీర్వచనం ఇచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆలయ అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

యువత ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



కోనరావుపేట(వేములవాడ)/వీర్నపల్లి(సిరిసిల్ల): గ్రామీణ ప్రాంతాల్లోని యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. కోనరావుపేట మండలంలోని జైసేవాలాల్ భుక్యారెడ్డితండా, వీర్నపల్లి మండలంలోని జవహర్‌లాల్‌తండాలో ఆదివారం పోలీస్ మేరా దోస్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్‌సేవలు మరింత దగ్గరయ్యేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని పిల్లలను చక్కగా చదివించుకోవాలని సూచించారు. యువత చెడు మార్గాలవైపు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. యువత క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ మొగిలి, వెంకటేశ్, ఎస్సై నవత, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు లకావత్ ప్రమీల, దివ్య, మాలోత్ సూర్యానాయక్, గుగులోత్ రజిత, రాములు, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

ఉద్యమంలో కవుల పాత్ర గొప్పది



సినారె చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



వేములవాడలో మాట్లాడుతున్న సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్

- దశాబ్ది ఉత్సవ కవి సమ్మేళనంలో వక్తలు
- కవులకు సన్మానం

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు గొప్ప పాత్ర పోషించారని పలువురు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాహిత్య దినోత్సవాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనంలో నిర్వహించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్యతో కలిసి సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కవి సమ్మేళనానికి అతిథులుగా రాష్ట్ర పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, ముఖ్య ప్రణాళికాధికారి పీబీ శ్రీనివాసాచారి, జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం, జనపాల శంకరయ్య హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ కవులు, రచయితలు తమ రచనల ద్వారా ప్రజల్లో తెలంగాణ కాంక్షను బలోపేతం చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేనన్నీ సంక్షేమ పథకాలతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందన్నారు. కవి సమ్మేళనంలో 40 మందికి పైగా కవులు తమ కవితాగానం చేశారు. పాల్గొన్న కవులకు ప్రభుత్వం తరపున నగదు పురస్కారం, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, మారసం ప్రతినిధి టీవీ నారాయణ, డాక్టర్ వాసరవేని పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో కవి సమ్మేళనం

వేములవాడ: తెలంగాణ ఉద్యమంలో కవులపాత్ర గొప్పదని, నలిగిపోయిన తెలంగాణపై రాసిన గీతాలు కంటతడి పెట్టించాయని సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ గుర్తు చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాజన్న ఆలయంలో జరిగిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వరాష్ట్ర ఫలాలు ప్రతీ ప్రాంతానికి అందుతున్నాయన్నారు. ఆలయ ఏఈవో బ్రహ్మణగారి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాజన్న సన్నిధిలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. శివార్చనతో ఎందరో కళాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. ఈ సందర్భంగా 25 మంది కవులను సన్మానించా రు. డాక్టర్ ఆవుల మల్లారెడ్డి, సంకెపల్లి నాగేంద్రశర్మ, ఎర్రోజు వెంకటేశ్వర్లు, డాక్టర్ వాసరవేని పర్శరాములు, కాందూరి వెంకటేశ్వర్లు, బూర సదానందం, చైతన్య, భక్త్యార్, అంగల శ్రీవాణి, గోనె బాల్‌రెడ్డి, నారాయణగౌడ్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



హాల్‌టికెట్ నంబర్ చూస్తున్న అభ్యర్థులు



సమయం లేక డివైడర్ పై నుంచి దూకి..



సమయం ముగియడంతో బయటనే..

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. సిరిసిల్లలోని 17 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. జిల్లాలో గ్రూప్‌-1 పరీక్షలను 4,261 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 2,915 మంది అభ్యర్థుల హాజరయ్యారు. 1,346 మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు, భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిరిసిల్ల తహసీల్దార్ విజయ్‌కుమార్ ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై స్థాయి పోలీసు అధికారులను నియమించి 144 సెక్షన్ విధించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.





శరణు.. శరణు రాజన్నా

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా కుటుంబ సభ్యులతో కలసి వేములవాడకు చేరుకున్నారు. వేసవి సెలవులు ముగియడం, సోమవారం నుంచి పాఠశాలలు పునర్‌ప్రారంభం కానుండడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నను దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాలను సందర్శించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు


చికిత్స పొందుతున్న లచ్చయ్య

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన చింతలకోటి లచ్చయ్య అనే గీత కార్మికుడు ఆదివారం తాటిచెట్టు పైనుంచి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చయ్య రోజూలాగే తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకజారి కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాగట్లపల్లి మూలమలుపు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. వివరాలోకి వెళ్తే.. రాజన్నపేట తండాకు చెందిన సురేశ్, రమేశ్ నాయక్ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాగట్లపల్లి మూలమలుపు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు


కోనరావుపేటలో స్టిక్కర్లు అందజేస్తున్న ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి

కోనరావుపేట: మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆటోలకు మీ భద్రతే మా బాధ్యత స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్‌తో స్టిక్కర్లను ఆటోలకు అంటిస్తున్నట్లు తెలిపారు. ఆటోలో ప్రయాణించే మహిళలు ఏదైనా ప్రమాదముందని భావిస్తే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపించాలని, దీంతో ఆటో లొకేషన్‌ను సులువుగా గుర్తించవచ్చన్నారు. మహిళలు క్యూఆర్ కోడ్ గురించి తెలుసుకోవాలని ఏఎస్సై సూచించారు. కానిస్టేబుళ్లు సత్యం, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట ఎస్సైగా ప్రేమ్‌దీప్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై ప్రేమ్‌దీప్

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట నూతన ఎస్సైగా ప్రేమ్‌దీప్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా షీటీంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఎల్లారెడ్డిపేట ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన ఎస్సై శేఖర్ మెదక్ జిల్లా ఎస్పీకి అటాచ్‌గా బదిలీపై వెళ్లారు. ఎస్సై ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సైకి పలువురు ప్రజాప్రతినిధులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆపద్బాంధవులు

- పేదింటి ఆడపడచులకు పుస్తెమెట్టెలు
- నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూత
- ఆపద సమయంలో అండగా..
- ఆపన్నహస్తం అందిస్తున్న మన ట్రస్టు

వేములవాడ మున్సిపల్‌లోని నాంపల్లి శివారులోని తెనుగుపల్లికి చెందిన పోతిరెడ్డి కనకవ్వ– కనకయ్య దంపతుల కూతురు అనూష పెళ్లికి ట్రస్ట్ సభ్యులు పుస్తెమెట్టెలు అందజేశారు. తండ్రి కనకయ్య అనూష చిన్నప్పుడే మరణించారు. జూన్ 1, 2023న అనూష పెళ్లి నిర్ణయం కాగా.. పుస్తెమెట్టెలు, సామగ్రి అందించారు. ఇలా మరో ఐదుగురికి అండగా నిలిచారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు ఒకే చోట చదువుకున్నవారు. అపూర్వ సమ్మేళనంతో కలుసుకున్న సందర్భంలో వచ్చి ఆలోచనకు రూపం ఇది. తలా ఇంత చందాలు వేసుకొని మన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అండగా నిలవాలని నిర్ణయించారు. ఇలా రెండేళ్లుగా సేవలు అందిస్తూనే ఉన్నారు.



పదోతరగతిలో పది జీపీఏ సాధించిన ఆలంపల్లి దివితకు ట్రస్టు సభ్యులు రూ.7వేలు ఆర్థిక సహాయం చేశారు. అంతటితో ఆగకుండా ఉన్నత చదువులకు సైతం అండగా ఉంటామని దివితకు హామీ ఇచ్చారు. ఇలా దివిత మాదిరిగా మరో ఐదుగురికి సాయం చేశారు.



వేములవాడ: సమాజానికి ఎంతో కొంత చేయాలనే ఉద్దేశంతో వేములవాడకు చెందిన మిత్రులందరూ కలిసి మన చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్న వారికి వైద్య ఖర్చులు.. ఆడకూతుళ్ల పెళ్లిళ్లకు పుస్తెమెట్టెలు.. నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికంగా సాయమందిస్తూ మేమున్నామంటూ భరోసానిస్తున్నా రు. వారి మిత్రబృందంలోని ఏ కుటుంబం ఆపదలో ఉన్న ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు.

రెండేళ్లుగా సేవలు

వేములవాడ ప్రాంతానికి చెందిన మిత్రులు 2021 నవంబర్ 14న మన చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ముందుగా 60 మంది క్లాస్‌మేట్స్‌తో కలసి ఈ సంస్థను ప్రారంభించారు. మొత్తం 143 మంది క్లాస్‌మేట్స్ సభ్యులుగా ఉన్నారు. వీరిలో 60 మంది ఆర్థికంగా, సామాజికంగా ముందుంటూ ట్రస్ట్ సేవలను విస్తరిస్తున్నారు. ఇప్పటి వరకు ఐదుగురు పేదింటి ఆడపడచులకు పుస్తెమెట్టెలు, ఐదుగురు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలు 22 మందికిపైగా తామున్నామంటూ భరోసా కల్పించారు. తమ క్లాస్‌మేట్ ఒకరు అ నారోగ్యంతో మరణించగా.. దహన సంస్కారాలు పూర్తి చేసి తోబుట్టువులుగా నిలిచారు.

ధనిక రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టారు

- నిరుద్యోగులపై సర్కార్ చిన్నచూపు
- కర్ణాటక తరహాలో తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు
- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్


పార్టీ కండువా కప్పుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: ధనిక రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణను కేసీఆర్ కుటుంబం లక్షలాది కోట్ల అప్పుల్లోకి నెట్టారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. సిరిసిల్లలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్పీ నుంచి పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటుందన్నారు. పుట్టబోయే బిడ్డపై కూడా రూ.1.50 లక్షల రుణభారాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం మోపుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. సిరిసిల్ల నియోజవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు ఉన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

చందుర్తి(వేములవాడ): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయమని డీసీసీ అధ్యక్షుడు, పార్టీ వేములవాడ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కట్టలింగంపేటలో కాంగ్రెస్ పార్టీ జెండాను డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాన్ను అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నీడ కల్పించామన్నారు. నియోజకవర్గ వెనుకబాటుతనానికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు అసమర్థతే కారణమన్నారు. నియోజక వర్గంలోని 55వేల ఎకరాలకు సాగు నీరందించామని అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, మల్రిపల్లి రిజర్వాయర్ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదో ఎమ్మెల్యే రమేశ్‌బాబు చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో చందుర్తి జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పొద్దుపొడుపు లింగారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి గొట్టే ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి ధర్మపురి శ్రీనివాస్, ఆవారి రమేశ్, సంతుపూరి బాలకృష్ణా రెడ్డి, నాయకులు పులి సత్యం, యెల్ల దశరథం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


యువతికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలానికి చెందిన శ్రీలత గతనెల 28న సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి ఆదివారం తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి యువతికి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మొబైల్ పోయినా, ఎత్తుకెళ్లినా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

గుట్టమట్టిని అమ్మేశారు !

- లేని గుడికి చందాల వసూలు
- సర్పంచ్‌ను నిలదీసిన గ్రామస్తులు


మట్టిని తరలిస్తున్న వాహనాలు

కోనరావుపేట(వేములవాడ): ప్రజాప్రతినిధులు కలిసి ఏకంగా గుట్ట మట్టినే అమ్మేశారు. ఊరిలో లేని గుడి పేరిట ఏకంగా రూ.85వేలు వసూలు చేశారు. కోనరావుపేట మండలంలోని రామన్నపేట శివారులోని గుట్టకు చెందిన మట్టిని ప్రజాప్రతినిధులు అమ్ముకోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ధర్మారం నుంచి నాగారం, రామన్నపేట మీదుగా చంద్రగిరి వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రామన్నపేట నుంచి నాగారం గ్రామానికి వెళ్లే రహదారిలోని గుట్ట వద్ద మట్టిని తవ్వుకునేందుకు కాంట్రాక్టర్‌తో పంచాయతీ పాలకవర్గం ఒప్పందం చేసుకుంది. గ్రామంలో లేని గుడికి విరాళం పేరిట రూ.80 వేలు వసూలు చేశారు. రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ గుట్టను తవ్వుతూ మట్టిని టిప్పర్లలో తరలిస్తుండడాన్ని గమనించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. అయితే తాను డబ్బులు చెల్లించి మట్టిని తీసుకెళ్తున్నట్లు కాంట్రాక్టర్ తెలపడంతో గ్రామస్తులు సర్పంచ్ సంతోష్, ఎంపీటీసీ మల్లేశంలను నిలదీశారు. తాము కాంట్రాక్టర్ వద్ద డబ్బులు తీసుకోలేదని, గ్రామంలో నిర్మించబోయే ఆలయానికి రూ.80 వేలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు.

‘లక్ష’ ఆశలు

- బీసీ వృత్తుల వారికి ప్రభుత్వం రూ.లక్ష రుణం
- భారీగా దరఖాస్తులు
- రద్దీగా మీసేవ కేంద్రాలు

చందుర్తి(వేములవాడ): బీసీ కులవృత్తుల వారికి కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించే పథకంపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం అందించే రూ.లక్ష రుణం పొంది ఆర్థికంగా బలోపేతం అవుదామని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రజక, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, కుమ్మరి, మేదరి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే దరఖాస్తులు చేసుకుంటున్నారు. మీసేవ కేంద్రాలు రద్దీగా మారాయి.

వీరు అర్హులు

గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షల లోపు, పట్టణాల్లో రూ.2లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్న వారికి ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయం తీసుకుంది. 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు గల వారు మాత్రమే అర్హులు. ఆర్థిక సహాయం కోసం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అర్జీదారులు ఫొటో, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెరుగుతున్న ఆశావహులు

బీసీ కుటుంబాలకు వ్యక్తిగత రుణాలు అందించేందుకు ప్రకటనలు చేయడంతో వారి కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తారనే ఆశతో బీసీ యువత గత ఐదారేళ్లుగా ఎదురుచూస్తోంది. ప్రస్తుతం చేతివృత్తుల వారిని ఆదుకునేందుకు రూ.లక్ష వ్యక్తిగత రుణం అందిస్తామని ప్రకటించడంతో అర్జీలు పెట్టుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు నిర్ణయించారు. కులం, ఆదాయం ఇతర సర్టిఫికెట్ల కోసం మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.


చందుర్తి మీసేవ కేంద్రంలో రద్దీ

అర్హులకు దక్కేనా

గతంలో బీసీ కార్పొరేషన్ ద్వారా మూడు కేటగిరీలుగా అందించిన బీసీ రుణాలలో పైరవీకారులదే పైచేయి అయ్యింది. ఈసారైనా అర్హులైన కుటుంబాలకు రూ.లక్ష రుణం దక్కుతుందో.. లేదోననే అనుమానాలు కలుగుతున్నాయి. ఎక్కువ అధికార పార్టీ నాయకుల అనుచరులకే దక్కుతాయనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక మూడేళ్లపాటు అందించిన బీసీ రుణాలు ఐదారేళ్లుగా నిలిచిపోయాయి. దాదాపు ఆరేళ్ల తర్వాత బీసీ రుణాల ప్రస్తావన తెరమీదికి రావడంతో నిరుద్యోగ యువకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పైగా గతానికి భిన్నంగా ఈసారి రూ.లక్ష రుణాన్ని వంద శాతం రాయితీతో అందిస్తుండడంతో ఈ అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలని ఆశావహుల సంఖ్య పెరుగుతోందని భావిస్తున్నారు. గతంలో కేటగిరీ–1 కింద రూ.75వేల నుంచి రూ.లక్ష , కేటగిరీ–2 కింద రూ.2లక్షలు, కేటగిరీ–3 కింద రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు రాయితీ రుణం అందేది. ఈసారి తక్కువ మొత్తంతో ఎక్కువ మంది బీసీలకు చేయూతనందించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

లయన్స్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మారం కుమార్


లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎంపికైన మారం కుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే రమేశ్‌బాబు కొనియాడారు. వేములవాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా నియమితులైన మారం కుమార్ అభినందన సభ ఆదివారం నిర్వహించగా.. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్‌క్లబ్ సమాజ సేవలో ముందుందన్నారు. కుమార్‌ను అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

మినీస్టేడియం పనులు షురూ

- రూ.5కోట్లతో పనులు
- కొనసాగుతున్న నిర్మాణాలు


ఇటీవల ప్రారంభమైన మినీ స్టేడియం పనులు

వేములవాడఅర్బన్: క్రీడాకారులు ఆటలు ఆడుకునేందుకు.. వాకర్స్ వ్యాయామం చేసుకునేందుకు ఉపయోగపడేలా వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వద్ద ఐదెకరాలలో మినీస్టేడియం నిర్మిస్తున్నారు. రూ.2.10కోట్లతో మినీస్టేడియం పనులు చేపడుతున్నారు. 2014 జూలై 13న వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, అప్పటి స్పీకర్ మధుసూదనాచారి శంకుస్థాపన చేశారు. అప్పుడే పనులు మొదలైనప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇటీవల మళ్లీ మినీస్టేడియం పనులకు నిధులు మంజూరుకావడంతో పనులు మొదలయ్యాయి. ఈసారైనా పనులు త్వరగా పూర్తి చేస్తే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చేయాల్సిన పనులు ఇవే..

మినీస్టేడియంలో చాలా వరకు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఆట స్థలం, ఇండోర్ స్టేడియం, క్రీడాకారులకు స్నానపు గదులు, సిబ్బంది కార్యాలయం, పోటీలను చూసేందుకు హాల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు పూర్తయితేనే స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి వస్తుంది. ఇటీవల రూ.5 కోట్లు మంజూరుకావడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల స్టేడియం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, స్టేడియం స్థలం చుట్టూ ఫెన్సింగ్ చేస్తున్నారు. స్టేడియం స్థలంలో మొరంపోసి చదును చేస్తున్నారు. నిర్మాణ దశలో ఆగిన పనులు ప్రారంభించారు. ఈ స్టేడియం పనులు ఆగస్టు 15వ తేదీలోగా పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలుపుకున్నారు.

స్టేడియం పనులు నడుస్తున్నాయి

మినీస్టేడియం పనులు ఇటీవల ప్రారంభించాం. స్టేడియం ఆవరణలో మొరంపోసి చదును చేశాం. ఆగిన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు ఆగస్టు 15వ తేదీలోగా పూర్తయ్యేలా చూస్తాం.

– శ్రీకాంత్, ఏఈ, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

- రూ.85 వేలు అందజేసిన మిత్రులు


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

చందుర్తి(వేములవాడ): పదోతరగతి వరకు తమతో కలిసి చదువుకుని అనారోగ్యంతో మృతిచెందిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన యువకుడు ఇల్లంతకుంట ప్రవీణ్ వేములవాడలోని గీత విద్యాలయంలో 2001–02 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివారు. ప్రవీణ్ అనారోగ్యంతో మృతిచెందాడన్న విషయం తెలుసుకుని వారి వంతు సహాయంగా రూ.85వేలు అందజేశారు. మిత్రులు నవీన్, సోమినేని రాజు, కట్ట రమణ, ప్రియతమ రాజు, బాలరాజు, వినయ్ ఆర్థిక సహాయాన్ని అందించారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రమేశ్


అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రుద్రంగి: రుద్రంగి లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మంచె రమేశ్, కార్యదర్శిగా బండి యాదగిరి, కోశాధికారిగా కొమిరె శంకర్ నియామకమయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ప్రత్యేక సమావేశానికి 320 జి జిల్లా రెండో ఉప గవర్నర్ సింహరాజు కోదండ రాములు హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంచె రమేశ్ మాట్లాడుతూ అధ్యక్షుడిగా తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సహకారంతో సమాజ సేవలో ముందుంటానన్నారు. కార్యక్రమానికి జిల్లా కేబినెట్ సెక్రటరీ మంద వెంకటరమణ, రీజియన్ చైర్ పర్సన్ మదుపు ప్రమోద్ రెడ్డి, కోర్ టీం సభ్యులు తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, రుద్రంగి క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో మోసపోయిన ఆటో డ్రైవర్

జగిత్యాలక్రైం : సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి మరో వ్యక్తి మోసపోయాడు. జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన ముత్యం శ్రీనివాస్ ఆటో నడుపుతున్నాడు. ఈనెల 1న శ్రీనివాస్ సెల్‌ఫోన్‌కు తన తమ్ముడు రవికుమార్ హాస్పిటల్‌లో ఉన్నట్లు రూ.20 వేలు ఫోన్ పే చేయాలని ఫొటోతో వాట్సాప్‌కు మెసెజ్ వచ్చింది. వెంటనే శ్రీనివాస్ డబ్బులు పంపించాడు. కొద్ది సేపటికి రవికుమార్‌కు ఫోన్ చేయగా తాను ఆరోగ్యంగానే ఉన్నానని, హాస్పిటల్లో లేనని చెప్పాడు. డబ్బులు కూడా తన ఫోన్‌పే కు రాలేదని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించాడు. శ్రీనివాస్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసారు.

అక్రమంగా మద్యం విక్రయించిన వ్యక్తిపై కేసు

వెల్గటూర్: మండలంలోని శాఖాపూర్‌లో అక్రమంగా మద్యం విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ధర్మపురి ఎక్సైజ్ సీఐ నరేశ్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మిరాల రమేశ్ బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సోదాలు నిర్వహించగా రెండు మద్యం సీసాలు, రెండు బీరు కాటన్లు స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై..

జగిత్యాలక్రైం : భూ విషయంలో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన బద్రె చంద్రశేఖర్ 2014లో ధరూర్ క్యాంప్‌లో రామాలయం వద్ద సర్వే నెంబర్ 346లో తిరుపతి గౌడ్ మధ్య వర్తిత్వంతో పెరుమాళ్ల రాజశేఖర్ వద్ద భూమి కొనుగోలు చేశాడు. కొన్ని రోజులుగా చంద్రశేఖర్ కొనుగోలు చేసిన భూమి రేటు పెరగడంతో తిరుపతి గౌడ్ నీ డబ్బులు నీకిస్తానని, లేకుంటే రూ.8 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుపతి గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.